# జన్మకుండలి

## జనన కాల విశిష్టత

-శ్రీ వక్కంతం చంద్ర మౌళి



జ్యోతిషశాస్త్రంలో "జన్మకుండలి"కి విశేష ప్రాధాన్యం ఉంది. దీనిని ప్రామాణికంగా తీసుకొని ఒక వ్యక్తి భూత, భవిష్యత్, వర్తమాన కాల విశేషాలను గణించి ఫలితాలను వ్యక్తీకరిస్తూ ఉంటారు. కానీ, కొన్ని ఫలితాలు ఖచ్చితంగా జరుగుట, మరికొన్ని జరగకపోవటాన్ని మనం గమనిస్తూ ఉంటాము. దీనికి కారణమేమిటి? విశ్లేషించే పండితుని పరిజ్ఞానమా? లేక "జన్మకుండలి"లోని గ్రహాలా? లేక గ్రహాల ఉనికిని నిర్దేశించిన పంచాంగమా? అని విశ్లేషిస్తే, దీనికి "పంచాంగం"లోని సమయ నిర్ధారణే మూలకారణంగా భావించవచ్చు. ఎందుకంటే ఒక మనిషి పుట్టిన సమయం, పుట్టిన స్థలం, పుట్టిన తేదీలకు విశేష ప్రాముఖ్యత ఉన్నది. ఈ మూడింటిలో ఏది సరైనది కాకపోయినను విశ్లేషకుడి ఫలితములలో తేడా రావచ్చు. అందుచేత ఫలితములను విశ్లేషించిన విశ్లేషకుడి చాతుర్యములను ప్రశ్నించేముందు జన్మకుండలిని నిర్దేశించే ఈ మూడింటి నిజనిర్ధారణ చేయుట మంచిది.

జాతకుని పుట్టిన తేదీ మరియు జన్మస్థల నిర్ధారణ సులభంగానే జాతకుని తల్లిదండ్రులు, వారి పూర్వీకుల నుండి సేకరించవచ్చు.

కానీ జన్మ సమయాన్ని నిర్ధారించేటప్పుడు జ్యోతిషునికి సమస్యలు ఉత్పన్నమవుతాయి. ఎందుకనగా, జన్మ సమయ నిర్ధారణ ప్రామాణికంలో బహు విధములైన పద్ధతులు ఉన్నవి. కొంతమంది శిశు శీర్షోదయాన్ని, కొంతమంది శిశు భూపతనాన్ని, మరికొంతమంది శిశురోదనను ప్రామాణికంగా తీసుకొని జన్మసమయాన్ని నిర్ధారిస్తారు. ప్రస్తుత కాలమాన పరిస్థితుల్లో సహజ ప్రసవానికి అవకాశాలు సన్నగిల్లుతున్న తరుణంలో జన్మ సమయ నిర్ధారణ మరింత కష్టతరమవుతున్నది. ప్రస్తుత కాలగమనంలో శస్త్రచికిత్సా విధానాన్ని అనుసరించి శిశు జననాలు జరుగుతున్నందువల్ల జ్యోతిష శాస్త్రాభిమానులు ముందుగానే పండితులచే శుభ ముహూర్త నిర్ధారణ గావించి శస్త్ర చికిత్స గావించుచున్నారు.

ఇట్టి స్థితిలో జన్మ సమయానికి ఏది ప్రామాణికం? ఇటువంటి సందర్భాలలో "జననకాల నిర్ధారణ" ఎంతవరకు సమంజసం? శస్త్రచికిత్స చేసిన సమయమా? లేక శస్త్రచికిత్స చేసిన అనంతరం తల్లినుండి శిశువును వేరు చేసి "స్పృహ" లోనికి తీసుకుని వచ్చిన సమయమా? ఏది ప్రామాణికం? ఈ నిర్ధారణను ఇంకనూ జటిలం చేస్తున్నవి మన గడియారాలు. ఈ గడియారాల సమయాలు కాలగమనంతో ఎంత వరకు సరిపోల్చవచ్చు? ఈ సమస్య కవలపిల్లల జన్మ సమయ నిర్ధారణలో మరీ కష్టంగా తయారవుతుంది.

అయితే సమయ నిర్ధారణ గావించుట ఎట్లు? సమాధానం తెలికేగాని ఆచరించటం మాత్రం కష్టసాధ్యం. జాతకులు మధ్యవయస్సు లేక ఆపైబడినవారైతే నిర్ధారణ కొంత వరకు సులభతరం.

వారి గత జీవిత విశేషాలు సేకరించి, వాటిని జన్మకుండలికి అనువదించి, జనన కాల నిర్ణయాన్ని కొంతవరకు నిర్ధారించవచ్చు. లేకుంటే జననకాల నిర్ధారణ పురాతన శాస్త్ర ప్రామాణికమైన "లగ్నస్ఫుట" విధానమే ఉత్తమమైనది.

శ్రీ వక్కంతం చంద్ర మౌళి ప్రతీ సంచికలోనూ ఇకనుంచి సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో జ్యోతిష్య శాస్త్ర విశేషాలు తెలుపుతారు.



# సువర్ణం!

బంగారాన్ని - సంస్కృతంలో స్వర్ణం అంటారు. దీనికి ఆ పేరు ఎలా వచ్చిందంటే 'సు' అంటే పవిత్రం, శ్రేష్ఠం అని అర్థం. 'వర్ణం' అంటే రంగు అని అర్థం. కాబట్టి సువర్ణం - అంటే మంచి వర్ణం కలది, రంగు మారనిది అని అర్థం. దీనినే మనం బంగారమని ప్రస్తుతం వాడుక భాషలో అంటున్నాము. దానికే భృంగారం, హేమం మొదలైన పర్యాయపదాలు కూడా ఉన్నాయి. ఇది అత్యంత విలువైన లోహంకూడా. సమూహంలో వస్తుమార్పిడి విధానం ఆచరణలో ఉన్ననాటికే బంగారాన్ని విరివిగా వాడేవారు. తద్వారా మనిషి జీవితంలో బంగారం పెనవేసుకుపోయిందని చెప్పవచ్చు. అలాగే ఆదిమానవుని కాలం నుంచి నేటి వరకూ, ఎన్నో లోహాలను కనిపెట్టడం జరిగింది. కానీ బంగారు ధాతువు మాత్రమే తన ఆస్తిత్వాన్ని నిలబెట్టుకోగలిగింది. మానవ నాగరికతపై సందేహాలు ఉండవచ్చేమోకానీ బంగారం విలువపై మాత్రం సందేహం లేదంటే అతిశయోక్తికాదు. నేటి ఈ మానవ సమాజాన్ని సాగించే ధనం సృష్టికి మూలం బంగారమే. నేడు విరివిగా వినియోగిస్తు ద్రవ్యం కనిపెట్టక పూర్వం బంగారు కాసులు, వరహాలు మొదలైనవి వ్యవహారంలో ఉండేవి. రాజుల కోశాగారాలన్నీ కూడా బంగారు కాసులు, ఆభరణాలతో నిండి ఉండేవి. ఆ కోశాగారంలో బంగారం ఎంతుందన్న అంశంపైనే ఆయా రాజుల అర్థబలాన్ని అంచనా వేసేవారు. ఇలా క్రమంగా బంగారం ప్రపంచ సంస్కృతినే శాసించగల స్థాయికి చేరింది. మనిషి జీవితంలోని శుభాశుభ కార్యక్రమాలన్నిటా బంగారం తనదైన పాత్రను పోషిస్తోంది. పూర్వం దేవాలయ గర్భగుడులు గాలి గోపురాలు బంగారంతోనే తాపడం చేయించేవారు. పురాణాల్లో చెప్పిన సత్య వేలాది వత్రాలు, నోముల్లో దేవతల బంగారు ప్రతిరూపానికి షోడశోపచారాలు చేసి బ్రాహ్మణునికి దానం చేయాలని పేర్కొనడం వలన బంగారం భక్తి ప్రదాత, ముక్తి ప్రదాత అని చెప్పవచ్చు. అలాగే నేడు అనేక మంది స్వర్ణకారులు బంగారు దుకాణాల వారు తమ భుక్తి మార్గంగా ఈ స్వర్ణాన్ని ఎంచుకున్నారు కాబట్టి ఇలా ఈ బంగారం ముక్తి, శక్తి, భుక్తి ప్రదాతగా వెలుగొందుతోందని చెప్పవచ్చు.